కథానిక

# కాలం ఏదైనా, కథ యిదే

గుడిపాటి శ్రీహరికృష్ణ

రాము జీవితంలో ఒక ఘట్టం ముగిసింది. తాను వలచిన వనిత తనకు కాకుండా పోయింది. అయితేనేమి ఆ వనితపై వలపులు ఇంకా అతనినుండి వైదొలగ లేదు.

వయసుకు తనకన్న పెద్ద అయినా తనకు విచక్షణ తెలిసింది ఆదిగా, తన మధ్య మెలిగే రాధమీద అనురాగం పెరుగుతూ వచ్చింది. కాళిదాస మహాకవి తన వయస్సును మించిన ప్రౌఢతో జీవితం గడిపాడనే ఒక విషయం తాను ఎక్కడో చదివినట్టు జ్ఞాపకం. ఇంతకీ ఈ సంఘపు కట్టుబాటులను దాటి తన అధీనం తప్పి సంచరించే మానసికభావ ప్రవృత్తుల పరిణామాలకు వయసుతో, రూపురేఖలతో, కట్టుబాటులతో లంకె ఏమిటి అనేదే అతనిని వేధిస్తున్న ప్రశ్న.

తాను కోరినా సంఘం తనకు కావలసిన రాధను తనకు కానీయదు- ఆ ప్రేమించిన రాధ తనకన్నా పెద్దది కావడమే- వయసు వ్యత్యాసం ఏ కొద్దిపాటి దైతేనేమిటి? ఒక్క ఘడియ చాలు- మగవానికన్నా ఆడది పెద్దది కావడానికి. అదే మగవాడైయితే ముదిమి వయసులో కూడా పదునారేళ్ళ పడుచుకి భర్త కావడానికి ఆటంకం, అంతరాయం లేదు. సైంటిఫిక్‌గా మగవాని వయసు, ఆడదాని వయసు కన్నా హెచ్చుగా వుండాలేమో! ఆ సంగతి మట్టుకు అతని మనస్సుకు పీకుతో వుండేది. ఈ ప్రశ్నకు సమాధానం అడిగితే ఎవరైనా చెప్పడం జరిగేదే. కాని ఒక నియమానికి అలవాటుపడ్డ సమాజంలో మరో సిద్ధాంతానికి సైంటిస్టు రావడం జరగదేమోననే భీతి కూడా వుండేది. చిట్టచివరకు ఎవరిని అడిగినా ప్రయోజనం వుండదనే నిశ్చయానికి వచ్చాడు.

అదీకాక వయసు తక్కువ అయిన పురుషులు, హెచ్చువయసు గల ఎందరో వనితలతో తెరచాటున జీవితాలు గడపడం అతను వీక్షిస్తున్నాడు. వారిలో అతనికి, వయసు మీరినవారి జీవితాలకన్నా తక్కువ స్థాయిలో స్థితిగతులు అంతగా ద్యోతకం కాలేదు. ఇలా తెరచాటున జరిగే సంప్రదాయానికి సాఫల్యంగా బహిరంగంగా జరగటానికి ఆటంకం ఏమిటి? దానిని ఎందుకు హర్షించరాదు? క్రమవిరుద్ధమని వాపోవడం దేనికి? ఆ సమస్యలే అతనిని కలత పెడుతున్నాయి.

"తప్పు గనకనే తెరచాటున జరుగుతున్నాయని" ఎవరైనా అంటే, "బహిరంగంగా జరిగే వాటిని భగ్నపరచగల, విరుద్ధమని ఎక్కిరించగల సమాజం, ఆ తప్పును జరగకుండా ఎందుకు ఆపుకు లేకపోయింది?" అని అతను అనడం కూడా కద్దు.

ప్రకృతిసిద్ధమైన పరిణామాలకు గిరిగీసి, కట్టుదిట్టం చేసుకుంది మనమే. వీటిలో లోపాలు వుండవని, సంస్కరణ అనవసరమని, నిన్న వున్నది నేడు, నేటిది రేపూ తు.చ తప్పకుండా శిలాశాసనాలలాగా అలానే వుండిపోవాలని తలపోయడం మూర్ఖునికి సరిపడవచ్చుగాని, ఏ కించిత్తు ధీశక్తి గలవారినీ నమ్మించడం, ఒప్పించడం, సమ్మతింపజేయడం సుతలాం సాధ్యంకాదని రాము భావం. అసాధ్యం కావడమెలాగున్నా, అసలు పరిణామాలను గుర్తించకుండా అలానే నిలిచిపోజూచే సమాజాన్ని సహించడం, సమర్థించడం, దానికి దాసోహమనడం విజ్ఞులకి ఏమాత్రం తగదని, కూడదనికూడా అతని వాదం.

ఇంతగా తన సంగతి వితర్కించుకొంటూ కాలం గడుపుతూవున్నాడు. రాధ తనకు కాకుండా మరొకరికి లభించింది. ఐతే రాధకు ఇతని హృదయంలోని విషయాలు ఎప్పుడూ విప్పి చెప్పటానికే వీలులేక పోయింది. ఇతనికి ఆ అభిప్రాయం కలిగేటప్పటికే రాధ

మరొకరి సొత్తు అయింది—మంగళసూత్రం పేరుతో. పోనీ చెప్పినా రాధను ఒప్పించడం ఎలా? రాధ పురాతన సంప్రదాయాలలో పుట్టి పెరిగింది. పెళ్ళి పీటలమీద జరిగిన తంతుకు తాను ఖైదీ అని, మనసు మరొకరికి కప్పగించినా, ఆ మరొకరితో జీవితం గడపాలని లోలోన పరితపిస్తున్నా, తాను ఆ బంధంనుండి వెలువడడం అసాధ్యమని విశ్వసించేదనేది అతనికి తెలుసు. అందుకే రాధకు తన మనసు విప్పి చెప్పలేక పోవడం జరిగింది.

రాధకు రాము అంటే ఎంతో అనురాగం వుంది. రాము కనిపిస్తే, ఆముఖ కవళికలు వికసిస్తాయి. రాముతో నవ్వుతూ ముచ్చటించటానికి సిద్ధమవుతుంది. రామును ఒంటరిగా కలుసుకొంటే ఎంతో ఆప్యాయంతో పలుకరిస్తుంది. అతి పరిచయంవలన "ఏరా" అనడంకూడా కద్దు. పదిమందిలో రాము వుంటే నవ్వు లోలోపల ఇముడ్చుకొని, తలవంచుకొని లేని సిగ్గును తెచ్చుకొని ఒదిగి ఒదిగి నడిచిపోవడం రాధకు పరిపాటయింది.

రాధ జీవితంలో ఎన్నోఘట్టాలు గడిచాయి. రాముకూడా సంఘ నియమావళికి దాసోహమని, మరొకతెను చేపట్టడం జరిగింది. ఆమెను ఎంతో గారాబంతో చూస్తాడు. ఎంతగానో ఆదరించి గౌరవిస్తాడు. కాని రాముకు రాధ మరుపురానందా అప్పుడప్పుడు వికలమనస్కుని చేస్తూ వుంటుంది.

ఇప్పటికీ రాధ రాముని ముఖంలోకి ఏదో ఆశతో చూస్తూనే వున్నట్టు రాము తలపోస్తూ వుంటాడు. రాము తన మనసు విప్పి ఒక్కసారి రాధ ముందు వుంచుదామని ఆలోచిస్తాడు.

కాని రాధ అప్పుడే పిల్లలతల్లి. అదీ కాక కరుడుకట్టిన సాంప్రదాయాలను మనసు ఇచ్చినది. ఆమె ఎలా వేదనపడుతుందో! తన ఆవేదన తనలోనే ఇముడ్చుకొని వూరకుండామనే భావంతో గడిపాడు.

ఈ లోపల రాధపై ఎన్నో అభాండాలు దొర్లించింది—సమాజం. ఆమె జీవితానికి ఎన్నో కళంకాలు ఆపాదించింది. వాటి నిజానిజాలు అంతగా రాముకు పట్టవు. తాను కాక తదితరులు తన మానసిక పరిణామాలకు అంతరాయం కలిగించి, మరోదారి త్రొక్కించినపుడు, తన జీవితంలో తప్పటడుగులు వేయడం రాధ తప్పుకాదు అని రాము తలంపు. రాధలో దోషాలు కానిపించినా, కొద్దో గొప్పో కలిగిన కుటుంబంలో పెరుగుతోంది గనుక, సమాజం చూడనట్టే భావించింది. ఈ అభాండాలు ఎంతవరకు నిజాలో రాముకు పరిశీలించాలనే భావం కలుగలేదు. ఒకని జీవితం భగ్నమయినపుడు తాను చేసేదేమిటో తనకే తెలియని స్థితిలో ఒకవ్యక్తి సంచరించడం జరగవచ్చుని రాము వాదం.

ఇప్పటికీ రామును ఈ ప్రశ్నలు వేధిస్తున్నాయి. రాధకు నా మనసు విప్పి చూపడం అవసరమా? అలా జరిగే పక్షంలో రాధలో వచ్చే పరిణామాలకు తాను జవాబుదారీ వహించడము జరగదా? ఇంతకీ రాధ తాను నివసించే సంప్రదాయాలను కాలదన్ని మరోలా ఎలా వ్యవహరించగలుగుతుంది? పోనీ నామీద కల అనురాగం కొద్దీ, మమకారం కొద్దీ నాదిశలో ఒరిగినా, అందరితోపాటు తామూ తెరవెనుక జీవితాలను గడపవలసిందేనా?

మొత్తంమీద రాము ఎప్పుడో ఒకప్పుడు తన మనసువిప్పి రాధముందు పెట్టాలనే నిర్ణయానికి రావడానికి అట్టేకాలం పట్టదు. రాధ కూడా రాము హృదయం లోనికి ఒక్కసారి తొంగిచూడాలనే ఆతురతతో మెలగడం జరుగుతున్నా, రామును ధైర్యంగా పలుకరించగల స్తోమత అంతగా కానిపించదు. దీనికి ఆమెకు నిరంతరం తనను కట్టి బంధించే సాంఘిక వ్యవస్థే జ్ఞాపకం వస్తుంది. అదే ఆమె నోటికి తాళం వేస్తోంది. మనసారా కష్టం అప్పజెప్పి చూచి ఆనందించటానికి కూడా జంకు కలిగిస్తోంది.

* * *

ఇలా కొన్ని యేళ్లు గడిచాయి. ఒకనాటి సాయంత్రం రాము రాధ గుమ్మం వైపు పోయి, పరధ్యానంగా వీధివాకిట నిలబడివున్న రాధవైపు చూచి "రాధా" అన్నాడు. రాధ లోపలికి వెళ్ళిపోయింది. తానూ ఆమె వెంటనే లోపలికి వెళ్ళి 'మీ వాళ్లులేరా?" అన్నాడు.

"అంతా వూరు వెళ్లారు."

“అలానా. సరే వెళ్ళి వస్తా” అని ముందుకు అడుగు వేశాడు.

“అప్పుడే వెడతావా? కూర్చో. ఏమీ తోచటంలేదు, మా మామగారికి ఎలాగుందో.” అంది.

వెనక్కి తిరిగి “నిమ్మదిగానే వుందటలే. భయం అక్కర్లేదు.” అన్నాడు.

“రామూ - ఆడవాళ్ళం ఒక్కళ్ళమే వున్నాం. నీవు వచ్చి సాయం పడుకుంటావా?” అంది.

రాముకు ముచ్చెమటలు పట్టాయి. ఇదే తొలిసారి తనను నోరుతెరచి రాధ ఒక కోరిక కోరడం. కాదనడం ఎలా? కాదనకపోతే రాధకు తృప్తికలగడం నిజం. కాని తన మనసుకు శాంతి వుంటుందా? చిట్టచివరకు ఒక్క ఆలోచన తట్టింది.

“ఇంకా ఎన్నాళ్ళీ దాపరికం. అదును వచ్చింది. మనసువిప్పి రాధకు తెలియచేద్దాం.” అని అనుకొని ‘సరే. అలాగే వస్తాను’ అని రాధ ముఖం చూచాడు.

రాధ ఒక్క నవ్వు నవ్వింది.

* * *

ఆ రాత్రి. రాధ గదిలో మంచం మీద ఏడాది దాటని మగబిడ్డను ప్రక్కలో నిడుకొని పడుకుంది. దానిని ఆనుకొనే ఆమె మరిద్దరు పిల్లలు పడుకున్నారు. సావిట్లో రాము పక్క వుంది. సావిట్లోకి పోయే గదిగుమ్మం ఈవల ఒకవైపుగా రాధ ముత్తవ్వ నిదురిస్తోంది.

ఇంతలో రంగున గడియారం పన్రెండు కొట్టింది. రాధ ప్రక్కలో పిల్లవాడు లేచాడు. రాధకు మెలకువవచ్చి వాణ్ణి ఓదార్చి పడుకోబెట్టింది.

రాము గుమ్మం దాటి నరాసరి గదిలో అడుగుపెట్టాడు అప్పుడే కనుమూసిన రాధ అలికిడి విని కను తెరచి “రామూ ఏం కావాలి” అంది.

“రాధా! ఇప్పటికి లగ్నం కుదిరింది. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి. వీలుపడుతుందా?” అన్నాడు.

“ఇంత రాత్రి. ఎవరైనా లేస్తే మనల్ని ఏం చేస్తారో” అంది.

“కాను, రాధా! ఇలారా” అని నెమ్మదిగా ప్రక్కగదిలోకి మూసివున్న తలుపులు తెరచి లోపల ప్రవేశించాడు. రాధ కూడా వెళ్ళింది.

“రాధా! ఎంతో కాలంగా నా హృదయం నీకు అంకితమైవుంది. ఇంతకాలంగా నీకు చెప్పకుండా గుప్తంగా దాచుకున్నా. కాని అసాధ్యమైంది. అదునుకూడా వచ్చింది.”

“రామూ-నీకు వివాహం జరిగింది. నాకూ అయింది. పిల్లల తల్లిని, అదీకాక నీకన్నా పెద్దదాన్ని. సంఘం సహిస్తుందా! ఈ తలంపు తప్పుకాదా?” అంది.

“రాధా-నీవు ఇలా అంటావని నాకు తెలుసు. ఈ మాటలు వెనుక నామీద అనురాగం నీలో దాగివుందనికూడా తెలుసు. నీవు సంఘానికి వెరుస్తున్నావు. సంఘానికి నీవు దాసురాలివయావు” అని అంటూండగానే రాధ ఒక్కసారి రాముమీదపడి “రామూ ఎప్పటికి కలిసాం! నా మనసు నీది. ఈ శరీరం పరులది. ఇప్పుడో రెండూ నీ చేతిలో వుంచుతున్నా.” అని కన్నీరు కార్చింది.

“రాధా-విచారించకు, జంకకు. మనం ఇద్దరం ఎక్కడికైనా పోయి మరోలా బ్రతుకుదాం” అన్నాడు.

“రామూ-ఆపని జరగదు.”

“అంటే మనం ఇలా దొంగ బ్రతుకు బ్రతకవలసిందేనా? ఎంతకాలం ఈజీవితం? ఎప్పుడైనా బయటపడదూ? అప్పుడైనా మన బ్రతుకు నడివీధికెక్కదా?” అన్నాడు రాము.

“దొంగ బ్రతుకు బ్రతకటం మనమేకాదు. నన్ను చేసుకొన్న భర్త అలానే కాలం గడుపుతున్నాడు. నాతోటిక కాదంటావా?” అని రాము ముఖంలోకి చూసి గట్టిగా కౌగలించుకొంది.

---

మొదటి చూపులతోనే ప్రేమ అంకురించడం సహజమే కావొచ్చు: అయినా కళ్ళద్దాలని ఒకసారి తీసి తుడుచుకుని మళ్ళీ ఓమాటు శ్రద్ధగా చూడడం శ్రేయస్కరం.